

**ఖాళీలు ఎక్కువ.. పోస్టులు తక్కువ**
ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు పోస్టులు ఉండడం నిరాశ కలిగిస్తోంది. 8లో



**పీజీ ఎంట్రెన్స్‌లో విద్యార్థుల ప్రతిభ**
పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) ప్రవేశ పరీక్షల్లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 8లో



**అభివృద్ధి పనుల్లో నాణ్యత ఏదీ?**
మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ లేక నాణ్యత కొరవడిందని లేదని మండల సమావేశంలో కౌన్సిలర్లు ఆరోపించారు. 9లో

## న్యూస్‌రీల్

### భగలాముఖీని దర్శించుకున్న హెల్త్ డైరెక్టర్



అమ్మవారి సన్నిధిలో శ్రీనివాస్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని భగలాముఖీ శక్తిపీఠం అమ్మవారిని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం నిర్వహించి ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. శివ్వంపేటలో భగలాముఖీ శక్తిపీఠం నిర్మించడం అద్భుతమని, ప్రతీ ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలని శ్రీనివాస్‌రావు అన్నారు.

### బాధ్యతతో పని చేయండి



ఎస్‌ఐలతో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న ఎస్‌ఐలు అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐలుగా నియామకమైన ఐదుగురిని మంగళవారం సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. ఎస్‌ఐలుగా ఎన్నికైన వారిలో ఏ.ఆర్ కానిస్టేబుళ్లు నలుగురు, కొల్చారం పోలీస్ స్టేషన్‌కి చెందిన సివిల్ కానిస్టేబుల్ ఉన్నారు.

### గ్రామాల్లో అభివృద్ధి బాగుంది



అంతారంలో డంపింగ్‌యార్డు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు బాగున్నాయని అదనపు కలెక్టర్ రమేశ్ అన్నారు. మంగళవారం ఆయన అంతారం, సామ్లా తండా, సోమక్కపేట్, శీలాంపల్లి గ్రామాల్లో పర్యటించారు. డంపింగ్ యార్డు, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, సీసీ రోడ్లు, మురికి కాలువలు, జీపీ భవనాలను పరిశీలించారు. గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పనితీరును తెలుసుకున్నారు. ఆయనతో ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ శశిప్రభ, ఇన్‌చార్జ్ ఎంపీఓ శ్రీనివాస్ శర్మ, సర్పంచ్‌లు అశోక్‌గౌడ్, కవిత, బిక్షపతి, కార్యదర్శులు రవిశంకర్‌గౌడ్, తిరుపతి, మనోజ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

### వర్గీకరణ చేసేవరకు పోరాటం



మాట్లాడుతున్న దుర్గయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు పోరాటం తప్పదని టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య అన్నారు. మంగళవారం కౌడిపల్లిలో టీఎంఆర్‌పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం టీఎంఆర్‌పీఎస్ నిరంతరం పోరాటాలు చేస్తుందని, ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకులు వర్గీకరణపై హామీ ఇచ్చి మాట తప్పుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా వర్గీకరణ జరగడంలేదని వాపోయారు. మండల అధ్యక్షుడు శేఖులు, నాయకులు సంజీవ్, శివరాం, యాదయ్య, ఏసు, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

### అవార్డుకు ఎంపిక



శరత్

చిన్నశంకరంపేట (మెదక్): ప్రతిష్టాత్మక అమెరికా యంగ్ ప్రొఫెషన్ అవార్డుకు మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ధరిపల్లికి చెందిన వెన్నవల్లి శరత్‌రెడ్డి ఎంపికయ్యారు. మెదక్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.ప్రతాప్‌రెడ్డి కుమారుడు శరత్‌రెడ్డి అమెరికాలోని సీఎంఏఏ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అమెరికాలో ఎన్నో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మాణాలకు సారథ్యం వహించాడు. వాషింగ్టన్ డీసీ శరత్‌కు కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించింది. అవార్డును ప్రకటన సమయంలో మంత్రి కేటీఆర్ అమెరికాలోనే ఉండటంతో శరత్‌ను అభినందించారు.

---

పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి పదిరోజుల క్రితం తీవ్ర జ్వరం రాగా స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షలు చేసిన వైద్యులు ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయని, పెద్దాస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మూడురోజుల పాటు చికిత్సపొందగా, రూ.1.50లక్షల ఖర్చు అయిందని వాపోయాడు.



# వణికిస్తున్న వైరల్ ఫీవర్స్

- జిల్లాలో 21కి చేరిన డెంగీ కేసులు
- పడిపోతున్న తెల్లరక్తకణాలు
- ఫైలేరియా కేసులు 1,862

మెదక్: జిల్లాలో రోజురోజుకు డెంగీ బాధితులు పెరుగుతున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలతో ఇళ్ల పరిసరాల్లో కుంటల్లో నీరు చేరాయి. దోమలు వ్యాపించడంతో ప్రజలకు జ్వరాల బారీన పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 21 మందికి డెంగీ నిర్ధారణ అయినట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. డెంగీ, ఫైలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. మెదక్‌లో 9, తూప్రాన్‌లో4, రామాయంపేటలో 2, చిన్నశంకరంపేట, పెద్దశంకరంపేట, హవేళీఘణపూర్, పాపన్నపేట మండలాల్లో ఒక్కోటి చొప్పున కేసులు నమోదయ్యాయి. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో సిబ్బందితో ఫాగింగ్ చేయించడం, చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పి అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి. మున్సిపల్, పంచాయతీ పాలకవర్గాలు నిరంతర పారిశుద్ధ్యంపై దృష్టి సారించకపోవంతోనే వ్యాధులు ప్రభలుతున్నాయనే ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా జూలైలో కురిసిన వర్షాలకు మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలతో పాటు గ్రామీణ ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని గాంధీనగర్, వెంకటరావు నగర్, శాంతినగర్ తదితర వార్డుల్లో ఇళ్లలోకి మురుగునీరు చేరింది.

**ఆ రెండు మండలాల్లో అధికం..**

గత మూడేళ్లలో జిల్లాలోని 21 మండలాల్లో 1,862 ఫైలేరియా కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా రామాయంపేట, నిజాంపేట మండలాల్లో 563 కేసులు నమోదయ్యాయి. ఫైలేరియా (బోదకాలు) వ్యాధి తీవ్రతను బట్టి జిల్లాలో 483 మందికి ప్రభుత్వం ఆసరా పెన్షన్ అందిస్తోంది. నిజాంపేట, రామాయంపేట మండలాల్లో సుమారు 151 మంది బాధితులకు పింఛన్ వస్తోంది. దోమల వ్యాప్తితో డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గన్యా, మలేరియాతో పాటు ఫైలేరియా వ్యాధులు కారణమవుతాయి. గ్రామాల్లో మురికి గుంతలు, పిచ్చిమొక్కలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయాలి. ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అది కనబడడంలేదు. వ్యాధుల నివారణకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

---

## బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు

- నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి



బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): బాల్య వివాహాలు చేసినా, వీటిని ప్రోత్సహించినా శిక్షార్హులు అవుతారని నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి అన్నారు. గ్రామానికి చెందిన ఓ బాలికకు వచ్చే నెల 3న వివాహం చేసేందుకు తల్లితండ్రులు ఏర్పాట్లు చేస్తున్నారనే విషయం తెలుసుకొని మంగళవారం పోలీస్, రెవెన్యూ సిబ్బందితో కలిసి చిట్కుల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆడపిల్లలు యుక్త వయసుకు రాకుండానే పెళ్లి చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అవగాహన కల్పించారు. చట్టప్రకారం బాల్య వివాహం నేరమని, నిబంధనల ప్రకారం బాలికలకు 18ఏళ్లు దాటిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. అనంతరం బాలిక తల్లితండ్రులతో ఒప్పంద పత్రం రాయించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, ఎస్‌ఐ షేక్ మహబూబ్, మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, ఆర్‌ఐ వెంకటేశ్వర్, కార్యదర్శి తిరుపతి, ఐసీపీఎస్ సిబ్బంది శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

---

## యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

- కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో భారత దేశానికి హాకీలో స్వర్ణ పతకం సాధించి పెట్టిన ధ్యాన్ చందన్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. ఛలో మైదాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, క్రీడల అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన..**

కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో ఎలక్ట్రో లిటరసీ క్లబ్‌ల ఏర్పాటు చేస్తామని, పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులు, వృద్ధుల కోసం సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ తీరుపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం పోటీలు నిర్వహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారిణి బ్రహ్మజి తదితరులు పాల్గొన్నారు.

---

## రెవెన్యూ డివిజన్ ప్రకటించాల్సిందే



రాస్తారోకో చేస్తున్న జేఏసీ నాయకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంను రెవెన్యూ డివిజన్ చేయాలని, మండలానికి మంజూరైన బీసీ గురుకుల పాఠశాల స్థానికంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కళాశాల విద్యార్థులతో కలిసి చిల్వెర ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. అరగంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించే వరకు పోరాటం చేస్తామని బీఎస్పీ నాయకుడు ప్రకాశం, మాజీ జెడ్పీ చైర్మన్, బీజేపీ నాయకుడు బాలయ్య స్పష్టం చేశారు. గురుకుల పాఠశాల ఏర్పాటయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బ్రహ్మం, రాములు, శేషారెడ్డి పాల్గొన్నారు.

---

## అన్నివర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారిణి విజయలక్ష్మి
- జెడ్పీ కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశాలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అధికారిణి విజయలక్ష్మి

మెదక్ కలెక్టరేట్: దళిత, గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మెదక్‌లోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. రామాయంపేట జెడ్పీటీసీ సంధ్య అక్షతన జరిగిన 6వ సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కింద 196 మంది విద్యార్థులను ఎంపిక చేశామని, స్కాలర్‌షిప్‌ల కోసం రూ.71,56,980లక్షల నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రోత్సాహం కింద రూ.2.50లక్షలు అందజేస్తున్నామని, ఈ ఏడాది 5 జంటలకు వీటిని అందించినట్లు పేర్కొన్నారు. 101 యూనిట్లలోపు విద్యుత్ వాడే నిరుపేదలకు రూ.2,98,11,036 కోట్లు ఖర్చు చేశామని, దళిత బంధు మొదటి విడతలో 256 యూనిట్లు, రెండో విడతలో నియోజకవర్గానికి 1,100ల చొప్పున ఎంపిక చేశామన్నారు. అనంతరం బీసీ కార్పొరేషన్ అధికారి శంకర్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్ వారి శాఖల పరిధిలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్, కౌడిపల్లి జెడ్పీటీసీ కవిత, టేక్మాల్ జెడ్పీటీసీ సరోజ పాల్గొన్నారు. అంతకుముందు మధ్యాహ్నం 2గంటలకు స్త్రీ, శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. అధికారులు బ్రాహ్మజీ, సంగారెడ్డి దుర్గాబాయి మహిళా సంఘం సమితి అధికారి రేణుక, మెదక్, నర్సాపూర్ సీడీపీఓలు స్వరూప, హేమ పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 3వ స్థాయీ సంఘ సమావేశంలో వ్యవసాయంపై సమీక్ష నిర్వహించారు. వెల్దుర్తి జెడ్పీటీసీ రమేష్, వ్యవసాయ అధికారి గోవింద్, వెటర్నరి అధికారి విజయచంద్రారెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి బ్రహ్మరావు తదితరులు పాల్గొన్నారు.

---

## మాతృమూర్తి అనుమానాస్పద మృతి



శంకరమ్మ (ఫైల్)



మృతురాలి మెడ చుట్టూ నల్లటి గాట్లు ఉన్న దృశ్యం

పాపన్నపేట(మెదక్): మండలంలోని అన్నారం గ్రామంలో ఓ మాతృమూర్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. కాసుల కోసం కక్కుర్తిపడిన కన్నకొడుకే తల్లిని కాటికి పంపాడా.? బీమా డబ్బులకు ఆశపడి పేగు బంధాన్ని మరిచి అమ్మను అంతమొందించాడా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దానమ్మోల గంగయ్య, శంకరమ్మ(57)కు నలుగురు సంతానం. పదేళ్ల క్రితం శంకరమ్మ భర్త గంగయ్య మృతి చెందడంతో కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుళ్ల వివాహం చేసింది. ఇద్దరు కొడుకుల్లో ఒకరు నీటి ప్రమాదంలో మృతి చెందాడు. మరో కుమారుడు ప్రసాద్ తల్లి కొనిచ్చిన ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

### కొడుకుపై అనుమానం!

అయితే మద్యానికి బానిసైన ప్రసాద్ సోమవారం రాత్రి తల్లితో గొడవపడ్డాడు. మరుసటి రోజు తన తల్లి చనిపోయిందని చుట్టుపక్కల వాళ్లకు చెప్పాడు. అంత్యక్రియలకు సిద్ధమవుతున్న తరుణంలో మృతురాలి మెడపై మరకలు కనిపించాయి. కొడుకే చంపి ఉంటాడని బంధువులు ఆరోపించారు.

**బీమా కోసమేనా..?**

నవమాసాలు మోసి, కని, పెంచిన తల్లిని రైతు బీమా కోసమే కుమారుడు, కోడలు కలిసి చంపేశారని మృతురాలి కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పట్టణ సీఐ వెంకటేశం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కొడుకు ప్రసాద్‌ను విచారిస్తున్నట్లు తెలిపారు.

---

## కనిపించే దేవుడు కేసీఆర్

- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి
- రామాయంపేట కాలువకు నీటి విడుదల



రామాయంపేట కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): నాడు పంటలు ఎండుతుంటే దేవుళ్లకు పూజలు, యాగాలు చేసేవారని, నేడు సీఎం కేసీఆర్ అన్ని కాలల్లో పంటలకు సాగునీరందించి కనిపించే దేవుడయ్యారని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి వర్గల్ మండలం గౌరారం వద్ద సంగారెడ్డి కాలువ నుంచి రామాయంపేట కాలువకు కొండపోచమ్మసాగర్ జలాలు వదిలారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో పంటలు ఎండిపోయే ఆస్కారముందన్న రైతుల వేదనను సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే కొండపోచమ్మ జలాల విడుదలకు అధికారులను ఆదేశించారన్నారు. 54 కిలోమీటర్ల రామాయంపేట కెనాల్ ద్వారా ఉమ్మడి మెదక్‌జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, మెదక్ నియోజకవర్గాలకు 41,203 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇరవై నాలుగు గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా, చెరువు, కుంటల పునరుద్ధరణ, కాలువల ద్వారా నీటిని అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని కొనియాడారు. రైతుల తరపున సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌రావుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్, సింగాయపల్లి సర్పంచ్ సంగీతవేణుగోపాల్‌రావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

---

## స్వరం పెంచిన మదన్‌రెడ్డి

- మౌనంగా సునీతారెడ్డి..
- సేవా కార్యక్రమాల్లో మైనంపల్లి రోహిత్
- మారుతున్న రాజకీయ సమీకరణలు



మెదక్: బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ఎలా చెబితే అలా.. అన్నట్లు ఉన్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి రెండు రోజులుగా స్వరం పెంచారు. నర్సాపూర్ టికెట్ తనదేనని, పోటీ చేసేది తానేనంటూ ప్రకటనలు చేస్తున్నారు. కేసీఆర్ ఏ ఆలోచనతో నర్సాపూర్ టికెట్‌ను హోల్డ్‌లో పెట్టారో తెలియదంటూనే.. సునీతారెడ్డికి ఎమ్మెల్సీ లేదా డిప్యూటీ స్పీకర్ ఇచ్చినా అభ్యంతరం లేదని, తనకు మాత్రం నర్సాపూర్ టికెట్ ఇవ్వాలని వ్యాఖ్యలు చేశారు.

**టికెట్‌పై పట్టు..**

ఈ నెల 21న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సిట్టింగ్‌లకే టికెట్లు కేటాయిస్తూ జాబితా విడుదల చేయగా, ఇందులో నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటించలేదు. జాబితా వెలువడిన రోజు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి క్యాంపు ఆఫీసులో కూర్చొని కలిసి టీవీ చూశారు. 23న జరిగిన సీఎం సభకు ఇద్దరూ హాజరయ్యారు. మరుసటి రోజు మదన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి టికెట్ తనకే ఇవ్వాలంటూ హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు ఇంటి వద్ద ధర్నా చేశారు. కాగా నాలుగు రోజులుగా మదన్‌రెడ్డి స్వరం పెంచారు. కాంగ్రెస్‌లో పదవులు అనుభవించి బీఆర్‌ఎస్‌లో చేరిన సునీతారెడ్డికి ఏ పదవి ఇచ్చినా పర్వాలేదని, నర్సాపూర్ టికెట్ మాత్రం తనకే ఇవ్వాలని కోరుతున్నారు. కాగా సునీతారెడ్డికి టికెట్ ఇవ్వాలని ఎక్కడ ఎవరూ డిమాండ్ చేయడంలేదు. ఈ విషయంపై ఆమె కూడా ఎలాంటి ప్రకటనలు చేయకుండా మౌనంగా ఉంటున్నారు.

**సేవాకార్యక్రమాల్లో రోహిత్..**

కాగా మైనంపల్లి రోహిత్ మెదక్ నియోజకవర్గంలో తన సేవా కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించారు. ఈ నెల 29న హవేళీఘనాపూర్ మండలం గాజిరెడ్డిపల్లిలో సొంత డబ్బులతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. గ్రామంలో 20 మంది అనాథ పిల్లలకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున డిపాజిట్ చేసి, ఆలయం నిర్మాణం కోసం రూ.లక్ష చెక్కును గిరిజనులకు అందించారు. మెదక్ బీఆర్‌ఎస్ టికెట్ పద్మాదేవేందర్‌రెడ్డికి కేటాయించడంతో మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తారా, లేక స్వతంత్రంగా బరిలో నిలుస్తాడా అనేది తెలియాల్సి ఉంది.

## క్లుప్తంగా

### తాగి వాహనాలు నడిపితే చర్యలు

నర్సాపూర్: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ శివకుమార్ హెచ్చరించారు. జనవరి నుంచి మంగళవారం వరకు నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 252 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. అలా పట్టుబడిన 30మందికి మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత జరిమానా విధించారని ఎస్‌ఐ వివరించారు.

### శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

**గజ్వేల్ ఏసీపీ రమేశ్**



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

తొగుట(దుబ్బాక): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఏసీపీ రమేశ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయంతో పాటు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసుల పనితీరుపట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐ కమలాకర్ పాల్గొన్నారు.

### రాజీతో కేసులు పరిష్కరించండి



మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్: కక్షిదారులతో రాజీ కుదిర్చి కేసులు పరిష్కరించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని కోర్టు హాల్‌లో లోక్ అదాలత్‌కు సంబంధించి కోఆర్డినేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు సివిల్ జడ్జి కృష్ణతేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఏపీపీ రవికిరణ్, హుస్నాబాద్, చేర్యాల సర్కిల్ పరిధిలోని సీఐ కిరణ్, ఎస్సైలు పాల్గొన్నారు.

### సెల్ ఫోన్ అప్పగింత

బెజ్జంకి(సిద్దిపేట): కోహెడ మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన బొలుముల జ్యోతి ఈనెల 25వ తేదీన గాగిల్లాపూర్‌లో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. దీంతో బెజ్జంకి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను కనిపెట్టారు. మంగళవారం ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి ఆమెకు దానిని అందజేశారు.

### పిచ్చికుక్కల దాడి.. పది మందికి గాయాలు

తొగుట(దుబ్బాక): పిచ్చికుక్కల దాడిలో పది మంది గాయపడిన సంఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేటలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాలు. వ్యవసాయ పనులు ముగించుకుని గ్రామంలోకి వస్తున్న వారిపై పిచ్చి కుక్కలు దాడిచేశాయి. దీంతో ఆకుల రాజు (42), గంట లత (26), దేవునూరి పోచయ్య (65), గొర్ల నరేష్, కటికె మోహన్, ఇరుకోడు లచ్చవ్వతో పాటు మరి కొంత మందికి గాయాలయ్యాయి. వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.



# ఖాళీలు ఎక్కువ.. పోస్టులు తక్కువ

- సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఖాళీలు 452
- భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది 141
- జిల్లాలో డీఎస్సీ కోసం 14వేల మంది నిరుద్యోగుల ఎదురుచూపు
- ఒక్కో పోస్టుకు 100 మంది పోటీ
- పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని డిమాండ్



మద్దూరులోని ప్రభుత్వ పాఠశాల

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ పాఠశాలలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం నిరాశ మిగిల్చింది. జిల్లావ్యాప్తంగా 452 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా ప్రభుత్వం కేవలం 141 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తక్కువ పోస్టులను చూసి నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఖాళీ ఉన్న టీచర్ పోస్టులకు 30శాతం మాత్రమే ప్రభుత్వం భర్తీ చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ఖాళీలు 452 ఖాళీ ఉంటే 141 పోస్టులు మాత్రమే భర్తీ చేయనుంది. జిల్లా వ్యాప్తంగా గతేడాది టెట్ మొదటి పేపర్ 10,019, పేపర్-2ను 7,816 మంది రాశారు. సెప్టెంబర్ 15న జరిగే టెట్ పరీక్షకు జిల్లా నుంచి పేపర్-1కు 8,625, పేపర్-2కు 6,817 మంది రాయనున్నారు. జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ కోసం సుమారుగా 14వేల మంది ఎదురుచూస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో పోస్టుకు వంద మంది పోటీ పడనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2017లో ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 8వేలకు పైగా భర్తీ చేశారు. ఆ తర్వాత ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ప్రభుత్వం టీచర్ పోస్టులను భర్తీ చేస్తుందని నమ్మకంతో బీఎడ్, డీఎడ్ కోర్సులు చేశారు. ఆరు సంవత్సరాల తర్వాత ఎట్టకేలకు ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన చేసింది.

**పదోన్నతులు ఇస్తే మరిన్ని ఖాళీలు**

జిల్లా వ్యాప్తంగా 976 ప్రభుత్వ పాఠశాలలుండగా అందులో ఉన్నత పాఠశాలలు 227, ప్రాథమికోన్నత 113, ప్రాథమిక 636 ఉన్నాయి. వాటిలో మొత్తం 85,436 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో టీచర్ల పదోన్నతులు జరిగితే మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. ఇందులో గెజిటెడ్ హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు పూర్తిగా పదోన్నతులతోనే భర్తీ చేయాల్సి ఉంది. మిగిలిన స్కూల్ అసిస్టెంట్‌లు అన్ని సబ్జెక్ట్‌ల్లో కలిపి 70 శాతం ఖాళీలను ఎస్జీటీల పదోన్నతితో భర్తీ చేయాల్సి ఉంది. ముందుగా పదోన్నతులు, బదిలీలు పూర్తయితే ఎస్జీటీల ఖాళీలు మరిన్న పెరిగే అవకాశం ఉంది.

**ఖాళీల వివరాలు**

| పోస్టులు | ఖాళీలు | ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినవి |
|---|---|---|
| స్కూల్ అసిస్టెంట్‌లు | 158 | 60 |
| భాష పండితులు | 24 | 24 |
| ఎస్‌జీటీలు | 190 | 49 |
| పీఈటీలు | 08 | 08 |

**పూర్తిస్థాయిలో పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలి**



రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటికీ నోటిఫికేషన్ విడుదల చేయాలి. జిల్లాలో కేవలం 141 పోస్టులనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేవలం 60 మాత్రమే ఉన్నాయి. ఇందులో రిజర్వేషన్లు, సబ్జెక్టుల వారీగా చూస్తే ఒక్కటి కూడా ఖాళీ కనిపించడం లేదు. ఇలా అయితే పదేళ్ల నుంచి ఎంతో కష్టపడి చదివిన చదువు వృథా అవుతుంది.

– దాసరి మనోజ్ కుమార్, బైరాన్‌పల్లి

# 'ఆశ'లతోనే ప్రభుత్వానికి అవార్డులు



వినతి పత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

హుస్నాబాద్: ఆశ కార్యకర్తలు అనేక ఒత్తిడిలను తట్టుకొని సేవలు అందించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డులు వచ్చాయని సీఐటీయూసీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఉద్యోగి ప్రతిభకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా కాలంలో ప్రజల ప్రాణాలు కాపాడిన మహిళా సైనికులు ఆశ కార్యకర్తలన్నారు. వారికి రూ.18వేల వేతనం, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలత, పద్మ, శోభ, శ్యామల, పద్మ, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 'ఉన్నతి కార్యక్రమం'పై శిక్షణ

**జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి**



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

హుస్నాబాద్: ప్రాథమిక తరగతుల్లో ప్రారంభమైన తొలిమెట్టు కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమంపై ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరోనా కారణంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మందగించాయన్నారు. ఈ అంశం వివిధ రంగాలపై ప్రభావం చూపుతుందన్నారు. దీనికోసం 6 నుంచి 9వ తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు ఉన్నతి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. రెండు విడతలుగా శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల విద్యాధికారులు దేశిరెడ్డి, నర్సింహారెడ్డి, పావని, సబ్జెక్ట్ బోధించే రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



యాదగిరి (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాయవరం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పేర్క యాదగిరి(42) తనకున్న ఎకరం భూమిలో వ్యవసాయంతో పాటు ఇతర పనులు చేస్తూ ఉంటాడు. రెండేళ్ల క్రితం కూతురు పెళ్లి, పంట పెట్టుబడి కోసం రూ.3 లక్షల అప్పు చేశాడు. దానిని తీర్చే మార్గం తెలియక మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపాడు.

**అప్పుల బాధతో..**

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముత్రాజ్‌పల్లిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి వివరాలు. గ్రామానికి చెందిన తలారి వీరేష్(32) వ్యవసాయంలో నష్టం రావడంతో బతుకుదెరువుకోసం ఐదేళ్ల క్రితం భార్య సంధ్యతో కలిసి హైదరాబాద్ వచ్చాడు. అక్కడ కూడా పనులు దొరకక అనారోగ్య సమస్యలతో తిరిగి ఇటీవల ఇంటికి వచ్చాడు. సొంత భూమిని సాగు చేస్తూ ఇతర పనులకు వెళ్తున్నాడు. సాగు పెట్టుబడి, అనారోగ్య సమస్యలు, కుటుంబ పోషణ కోసం సుమారు రూ 6లక్షలు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గంలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

**మనస్తాపంతో..**



మధుసూదన్ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): ఐదేళ్లుగా భార్యా పిల్లలు దూరంగా ఉంటున్నారని మనస్తాపంతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమడుగు గ్రామంలో జరిగింది. ఏఎస్‌ఐ పర్వేజ్ అహ్మద్ వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్‌కు చెందిన మధుసూదన్(35) బతుకు దెరువు కోసం దోమడుగు వచ్చాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో వేర్వేరుగా ఉంటున్నారు. భార్యను కాపురానికి రావాలని ఎన్నిసార్లు కోరినా రాకపోవటంతో మనోవేదనకు గురైన మధుసూదన్ దోమడుగులోని ఓ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

# పీజీ ఎంట్రెన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

**సెంట్రల్ యూనివర్సిటీలో 5వ ర్యాంకు**



అర్థశాస్త్రంలో 5వ ర్యాంకు సాధించిన శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



నరేందర్



జీవన్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) ప్రవేశ పరీక్షల్లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మంగళవారం విడుదలైన పీజీ సెట్ ఫలితాల్లో కళాశాలకు చెందిన సుమారు 25 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడారు. కళాశాలకు చెందిన గడం శ్రీకాంత్ అనే విద్యార్థి సీయూసెట్‌లో అర్థశాస్త్రంలో 5వ ర్యాంకు సాధించాడన్నారు. ఫలితంగా కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేసే అవకాశం వచ్చిందన్నారు. కెమిస్ట్రీలో 25 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి వాసం శ్రీనివాస్ ప్రత్యేక చొరవతీసుకుని విద్యార్థులకు ప్రత్యేకంగా నెల రోజుల పాటు కోచింగ్ అందించారని తెలిపారు. హర్యాన సెంట్రల్ యూనివర్సిటీలో నరేందర్, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో జీవన్‌రెడ్డి కెమిస్ట్రీలో పీజీ సీట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అర్థశాస్త్ర విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భవాని, అధ్యాపకులు డాక్టర్ మల్లేశం, డాక్టర్ శ్రద్ధానందం, ఆంజనేయులు, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సుమలత, శ్యాంసుందర్, సలీంపాషా, బాలకిషన్, రవికుమార్‌లతో పాటు పీజీలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు. ఆదివారం, సోమవారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరుచగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

**జరిమానా, జైలు**

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు ఒకరికి జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రూ.10,500 జరిమానాతో పాటు వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

# వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బైక్

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. హైదరాబాద్ వైపు నుంచి జహీరాబాద్‌కు వస్తున్న కారు గేదెను తప్పించబోయి అదుపు తప్పి మోటారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు కోహీర్‌కు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**రోడ్డు ప్రమాదంలో ..**



రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల వివరాలు. మంగళవారం 65వ జాతీయ రహదారిపై జహీరాబాద్ వైపు వెళుతున్న కారు అడ్డుగా వచ్చిన ఆవును తప్పించే ప్రయత్నంలో బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న కోహీర్‌కు చెందిన సమియొద్దీన్, అతని మిత్రుడు గాయపడ్డారు. సమియొద్దీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# తప్పతాగి.. పిల్లలను రోడ్డుపై వదిలేసి..



చిన్నారులను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ: ఇంట్లో నుంచి ఇద్దరు పిల్లలతో బయటకు వచ్చిన ఓ తండ్రి పీకల వరకు తాగి బస్టాండ్‌లో పడిపోయాడు. దీంతో ఐదేళ్లలోపు పిల్లలు ఏడుస్తూ రోడ్డుపైకి వచ్చారు. ఈ సంఘటన సోమవారం రాత్రి మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్‌కు చెందిన ఓ కుటుంబం మెదక్‌లోని అవుసులపల్లి వద్ద జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు చేసేందుకు వచ్చింది. అయితే ఆ కుటుంబానికి చెందిన వ్యక్తి తన పిల్లలను తీసుకొని సోమవారం రాత్రి పట్టణానికి వచ్చాడు. వైన్‌షాపులో పీకల వరకు మద్యం తాగి పాత బస్టాండ్‌లో సోయి తప్పి పడిపోయాడు. అతని వెంట వచ్చిన పిల్లలు ఏడ్చుకుంటూ రోడ్డుపై రాగా, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పిల్లల ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసి బాలసదనంలో అప్పగించారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన భర్తను పిల్లలు ఎక్కడ అని భార్య నిలదీసింది. వాట్సాప్ గ్రూప్‌లలో పిల్లల ఫొటోలు చూసిన కాంట్రాక్టర్ విషయాన్ని పిల్లల తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. బాల సదనంలో ఉన్న చిన్నారులను పోలీసులు వారికి అప్పగించారు.

# ముగ్గురి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం కేసు నమోదైంది. పోలీసుల వివరాలు. మండల పరిధిలోని ఇస్నాపూర్ ఇంద్రమ్మ కాలనీకి చెందిన అఖిల(19) సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె సోదరుడు మహేష్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**బాలిక...**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలిక అదృశ్యమైన కేసు నమోదైంది. పోలీసుల వివరాలు. పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలిక(17) రాత్రి కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేసి 9 గంటలకు పడుకుంది. రాత్రి 11 గంటలకు చూడగా ఇంటిలో బాలిక కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**వ్యక్తి...**



వెంకట్ రామరాజు

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాలు. పట్టణానికి చెందిన ఉజునూరి వెంకట్‌రామరాజు(41) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం అతని భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# వివిధ కారణాలతో ఆరుగురి మృతి



కిష్టయ్య మృతదేహం

మర్కూక్(గజ్వేల్): చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పాములపర్తిలో జరిగింది. గ్రామస్తులు, పోలీసుల తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పెద్దబోయిన కిష్టయ్య(53) చేపల పట్టి విక్రయిస్తూ ఉపాధి పొందుతుంటాడు. సోమవారం మధ్యాహ్నం మర్కూక్ పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతికారు. మంగళవారం ఉదయం పెద్ద చెరువులో శవం తేలి ఉండటం చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎంపీపీ పాండుగౌడ్, పోలీసులు చెరువు వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

**నీటి గుంతలో పడి..**



యాదగిరి (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): ఎద్దులకు నీళ్లు తాగించడానికి వెళ్లిన రైతు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలు. గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన కమిటి యాగదిరి(27) వ్యవసాయం చేస్తుంటాడు. మంగళవారం బంధువుల పత్తి పంటలో ఎద్దులతో దంతే పనులు చేపట్టాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గోరుగుట్ట సమీపంలోని నీటి గుంతల వద్ద ఎద్దులకు నీళ్లు తాగించేందుకు వెళ్లాడు. కాలు జారి అందులో పడ్డాడు. స్థానికులు అతన్ని అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

**చెరువులో పడి..**

చేగుంట(తూప్రాన్): చెరువులోపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రుక్మాపూర్ గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల వివరాలు. గ్రామానికి చెందిన రొండ్ల అనుసూయ చిన్న కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి(38)కి ఫిట్స్ ఉండటంతో వివాహం కాలేదు. తల్లితో కలిసి ఉంటూ కూలీకి వెళ్తుంటాడు. ఇటీవల మద్యంకు బానిసేన శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం వెతుకుతుండగా సోదరుడు సాయిరెడ్డికి మంగళవారం గ్రామశివారులోని గుండ్ల చెరువులో శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

**మెట్లపై నుంచి పడి..**

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు మెట్లపై నుంచి పడి మృతి చెందిన ఘటన బొంతపల్లి పారిశ్రామికవాడలో మంగళవారం జరిగింది. ఏఎస్‌ఐ పర్వాజ్ అహ్మద్ వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సోకీరాం(53) బొంతపల్లిలో నివాసం ఉంటూ స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. పరిశ్రమలో ఒక బ్లాక్ నుంచి మరో బ్లాక్‌కు వెళ్తుండగా అదుపుతప్పి మెట్లపై నుంచి కింద పడ్డాడు. దీంతో సోకీరాం తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో సోకీరాం మృతి చెందాడు. మృతుడి తండ్రి రంజిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

**దాడిలో గాయపడిన వ్యక్తి..**

చిన్నకోడూరు(సిద్దిపేట): దాడిలో గాయపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి లో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తుల వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య (70), అదే గ్రామానికి చెందిన గుర్రం నవీన్ సోదరిని సోమవారం అకారణంగా దూషించాడు. ఈ విషయాన్ని ఆమె హైదరాబాదులో ఉంటున్న సోదరుడు నవీన్‌కు తెలిపింది. దీంతో నవీన్ గ్రామానికి వచ్చి అంజయ్యపై కర్రతో దాడి చేసి నెట్టేయడంతో ఇటుకల పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుభాష్ గౌడ్ తెలిపారు.

**చికిత్స పొందుతూ వృద్ధుడు..**

దుబ్బాక : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 2వ వార్డుకు చెందిన కంతి గంగయ్య (80) కూలీ చేసుకుంటూ జీవనం గడిపేవాడు. వయసు పై పడడంతో ఏ పని చేయలేక, చేతిలో డబ్బులు లేక జీవితం మీద విరక్తి చెందాడు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని నీలగిరి తోటలో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న గంగయ్యను దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం గంగయ్య మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతిడి కొడుకు పర్షరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పెళ్లింట్లో విషాదం

**గుండెపోటుతో కుప్పకూలిన ఎంపీపీ మామ**



భాగ్యలక్ష్మిని ఓదార్చుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట ఎంపీపీ ఇంట విషాదం నెలకొంది. ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి మామ(డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ ఆవుల గోపాల్‌రెడ్డి తండ్రి) కిష్టారెడ్డి(68) గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం రాత్రి మండలంలోని జంగరాయిలో ఎంపీపీ కూతురు సుష్మారెడ్డి వివాహ వేడుకలో భాగంగా వధువును ఆశీర్వదిస్తున్న క్రమంలో కృష్టారెడ్డి గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో బుధవారం జరగాల్సిన సుష్మారెడ్డి వివాహం రద్దయింది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన కిష్టారెడ్డి అంత్యక్రియల్లో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాధవిరాజు, బట్టి జగపతి పాల్గొన్నారు.